

జగన్.. అర్జునుడు కాదు, ఔరంగజేబు

సీఎం జగన్, నీవు అర్జునుడివి కాదు.. సాక్షాత్తూ ఔరంగజేబు కన్నా క్రూరాతి క్రూరుడివి. రాష్ట్రాన్ని అన్ని విధానాలుగా దోచుకుని, దౌర్జన్యాలను ప్రోత్సహించావు. అర్జునుడు ఒంటిరివాడు కాదు. పంచపాండవులలో ఒకడు. తండ్రి చనిపోతే రాజ్యంకోసం సంతకాలు సేకరించలేదు. రాజ్యం కోసం ఏనాడూ సానుభూతి రాజకీయాలు చేయలేదు, కోడికత్తి డ్రామా ఆడలేదు.

- పలమనేరు టీడీపీ కార్యాలయంలో మాజీ మంత్రి అమరనాథరెడ్డి

సర్వర్ కష్టాలు

● రాత్రిపూట కులగణన

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 27: వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి కులగణన కత్తిమీద సవాల్‌గా మారింది. సర్వర్ మొరాయిస్తుండటంతో రాత్రిపూట విధులు నిర్వహిస్తున్నారు. జిల్లాలో 5,90,589 కుటుంబాలుండగా, 18,76,761 మంది జనాభా ఉన్నారు. క్లస్టర్లుగా విభజించి.. కులగణన ప్రక్రియ చేపడుతున్నారు. సర్వే సమయంలో ఉద్యోగుల వేలిముద్రలు తప్పనిసరి. ఉదయం ఆరు నుంచి 10 గంటలవరకు సర్వర్ బాగా పనిచేస్తుంది. మధ్యాహ్నం నుంచి రాత్రి ఏడు గంటల వరకు సరిగా పనిచేయడం లేదు. దీని వల్ల ప్రజలు కూడా తమ పనులు మానుకుని గంటలకొద్దీ వేచి ఉండాల్సి రావడంతో ఇబ్బంది పడుతున్నారు. ఈనేపథ్యంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు.. రాత్రి 10 గంటల వరకు కూడా తమ క్లస్టర్ల పరిధిలోని ఇంటింటికీ తిరుగుతున్నారు. రాత్రివేళ పనిచేయాల్సి రావడంతో మహిళా సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక జిల్లావ్యాప్తంగా 80శాతం మేర కులగణన సర్వే జరిగిందని అధికారులు శనివారం తెలిపారు. 5.90 లక్షల కుటుంబాలకుగాను 4.60 లక్షల కుటుంబాల సర్వే పూర్తిచేశామని పేర్కొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జిగా బంగారుపాళ్యం యువకుడి ఎంపిక

బంగారుపాళ్యం, జనవరి 27: బంగారుపాళ్యం మండలంలోని ముంగరమడుగు గ్రామానికి చెందిన ఎం.రోహిత్ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. 2023లో నిర్వహించిన సివిల్ జడ్జి పరీక్ష ఫలితాలను శుక్రవారం హైకోర్టు విడుదల చేయగా ఓపెన్ కేటగిరీలో ఈయన ఎంపికయ్యారు. దీంతో రోహిత్‌ను శనివారం గ్రామస్తులు అభినందించారు.




ఎం.రోహిత్

ఆత్మలు ఓటేస్తాయా?



చచ్చిపోయినా.. చెదరని ఓటు

పులిచెర్ల మండలం దేవళంపేట పంచాయతీ 242 పోలింగ్‌స్టేషన్‌లోని 323 సీరియల్ నెంబరులోని వీకే పల్లికి చెందిన యండపల్లి శేషమ్మ ఆరు నెలల క్రితం మృతి చెందింది. అలాగే బాలిరెడ్డిగారిపల్లికి చెందిన 455 సీరియల్ నెంబరులోని రాజారెడ్డి ఏడాది క్రితం మరణించాడు. ఇక తుడుంవారిపల్లికి చెందిన 491 సీరియల్ నెంబరులోని వెంకటప్ప 5 ఏళ్లక్రితం మృతి చెందాడు. అయినా వీళ్లందరి పేర్లూ తుది ఓటర్ల జాబితాలో నిక్షేపంగా ఉన్నాయి.




ముసాయిదాను పరిశీలించి తప్పొప్పులను సవరించి ప్రకటించేదే తుది జాబితా. అయితే అందులోనూ కుప్పలు తెప్పలుగా తప్పులుంటే.. ఏం చేయాలి? అధికార వైసీపీపై దొంగ ఓట్ల ఆరోపణలు వెల్లువగా వస్తున్న వేళ.. ఈ తప్పులు మరిన్ని అనుమానాలకు తావిస్తున్నాయి. ముసాయిదాలో తప్పులను టీడీపీ కార్యకర్తలు గుర్తించి వివరాలను ఇచ్చినా, తుది జాబితాలో సవరించకపోవడం విచిత్రం. ఎప్పుడో టపా కట్టేసిన వారికీ జాబితాల్లో అనేకచోట్ల ఓట్లున్నాయి. కొందరికి రెండేసి ఓట్లు కూడా ఉదారంగా ఇచ్చేశారు. తుది జాబితాను పరిశీలించేకొద్దీ అనేక అవకతవకలు ఇలా బయటపడుతూనే ఉన్నాయి. వాటిలో కొన్ని ఇవి..

● తుది జాబితాలో తవ్వేకొద్దీ తప్పులే...!

డబుల్ ఎంట్రీలు

పులిచెర్ల మండలం కల్లూరు, పాళెం పంచాయతీలకు సంబంధించిన ఉమ్మడి పోలింగ్‌స్టేషన్ పరిధిలో డబుల్ ఎంట్రీలు కనిపిస్తున్నాయి. 239 పోలింగ్‌స్టేషన్‌లోని సీరియల్ నెంబరు 133 ముఖేష్‌కుమార్ బడిగనేని అనే పేరుతో ఐడీ నెంబర్ టీవీఎఫ్1063668గా ఓటు ఉంది. ఇదే పోలింగ్‌స్టేషన్‌లో సీరియల్ నెంబర్ 887లో బడిగనేని ముఖేష్‌కుమార్ అని ఉండగా ఈ పేరుకు ఐడీ నెంబరు లేదు. 241 పోలింగ్‌స్టేషన్ పరిధిలో సీరియల్ నెంబర్లు 29, 1078ల్లో వేదప్రకాష్ పేరు ఉంది. జాబితాను జాగ్రత్తగా పరిశీలిస్తే ఇటువంటివి అనేకం కనిపించేలా ఉన్నాయి.



డబుల్ ఎంట్రీ






హిందీలో ఓటరు వివరాలు

ఓటరు జాబితా తెలుగులో ఉంటుంది. అయితే పులిచెర్ల మండలం కల్లూరు పంచాయతీలోని 241 పోలింగ్‌స్టేషన్ పరిధిలో సీరియల్ నెంబరు 682లోని దస్తగిరిసాబ్ కుమారుడు బావాజాన్ అని హిందీలో ఉండటం విడ్డూరం. **- కల్లూరు**

బతికున్నా తొలగించేశారు







వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం పేటకు చెందిన మునెమ్మ(54)కు క్రమ సంఖ్య-285లో ఓటు ఉండేది. అయితే తాజా జాబితాలో తొలగించారు. కారణం తెలియడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పలమనేరులోనూ మృతులకు ఓట్లు

పలమనేరు మున్సిపాలిటీలో 259 పోలింగ్ స్టేషన్ పరిధిలో 1399 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 684, స్త్రీలు 715 మంది. ఈ ఒక్క పోలింగ్‌స్టేషన్ పరిధిలో పరిశీలిస్తేనే దాదాపు 30 మందికిపైగా చనిపోయిన వారి పేర్లు తుది జాబితాలోనూ కనిపిస్తున్నాయి. 259 పోలింగ్‌స్టేషన్ పరిధిలో సర్వేచేసిన టీడీపీ కార్యకర్తలు దాదాపు 42 మంది వరకు చనిపోయినవారి పేర్లు జాబితాలో ఉన్నాయని గుర్తించారు. చనిపోయిన వారి వివరాలను, ఓటరు నెంబరు, ఇంటి నెంబరు, సెల్ నెంబరుసహా బీఎల్వోకు అందజేశారు. దానిమీద బీఎల్వో సంతకం కూడా తీసుకున్నారు. తుది జాబితాను చూసిన టీడీపీ కార్యకర్తలు నివ్వెరపోయారు. తాము 42మంది మృతుల వివరాలు ఇస్తే, 12 మాత్రమే సవరించారు. మిగిలిన 30 మంది పేర్లు యథాతథంగా ఉన్నాయని గుర్తించారు. ఇందుకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని పలమనేరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు నాగరాజు డిమాండు చేశారు. ఈ విషయాన్ని తాము సోమవారం ఆర్డీవో దృష్టికి కూడా తీసుకు వెళ్లనున్నట్లు తెలిపారు.



- ఇదే పోలింగ్ స్టేషన్ పరిధిలోనే తప్పుడు డోర్ నెంబరుతో కూడా ఓట్లు ఉండటం గమనార్హం. ఉదాహరణకు ఇంటి నెంబరు3- అని ఇక్కడ ప్రారంభమవుతుండగా 39- అంటూ ఒక ఇంటి నెంబరులో ఓటరు ఉన్నారు.



ఆత్మలకూ ఓటు కల్పించారు

పచ్చికాపల్లం పోలింగ్ కేంద్రం-63 పరిధిలో పచ్చికాపల్లంకు చెందిన బక్ష సాహెబ్(45) రెండేళ్ల క్రితమే చనిపోయారు. ఆయన ఆత్మకు తాజా జాబితాలో క్రమ సంఖ్య-827తో ఓటు సదుపాయం కల్పించారు. అలాగే పచ్చికాపల్లంకు చెందిన బాలమ్మ(59) సుమారు పదేళ్ల క్రితం చనిపోయినా క్రమ సంఖ్య-763తో ఓటు ఉంది.

- వెదురుకుప్పం



- ఇక్కడే 3-176 ఇంటిలో మూడు ఓట్లను తొలగించారు. ఈ ఇంటిలో ఉన్న వ్యక్తి గత మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ తరఫున మున్సిపల్ కౌన్సిలర్‌గా నామినేషన్ వేశారు. ఆయన ఓటుతోపాటు తల్లి జ్యోతి, తండ్రి కె.ఎన్.శ్రీరంగ పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించారు.

- పలమనేరు

పెండింగ్ కేసులు త్వరగా పరిష్కరించాలి

● జిల్లా పరిపాలనా న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందనరావు

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 27: జిల్లాలో వివిధ కోర్టుల్లో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న కేసులను త్వరగా పరిష్కరించి, కక్షిదారులకు న్యాయం చేయాలని హైకోర్టు న్యాయమూర్తి, చిత్తూరు జిల్లా పరిపాలనా న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందనరావు సూచించారు. శనివారం స్థానిక జడ్పీ మీటింగ్ హాలులో అడ్మినిస్ట్రేషన్ సివిల్, క్రిమినల్ కేసుల పరిష్కారానికి సంబంధించి ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని జ్యుడీషియల్ ఆఫీసర్లకు నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి, మాట్లాడారు. జిల్లాలో సివిల్, క్రిమినల్ కేసులు ఎక్కువగా పరిష్కరించిన న్యాయమూర్తులను అభినందించారు. ఇలాంటి కేసుల పరిష్కారానికి అవసరమైతే విశ్రాంత న్యాయమూర్తుల సలహాలు, సూచనలను తీసుకోవాలని చెప్పారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు మాట్లాడుతూ న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో లోక్ అదాలత్‌లు నిర్వహించి వివిధ రకాల కేసులు పరిష్కరించామని వివరించారు. జిల్లాలో కోర్టు భవనాలు, జడ్జిల క్వార్టర్స్ నిర్మాణాల పనులకు సంబంధించిన వివరాలను హైకోర్టు న్యాయమూర్తికి తెలియజేశారు. అంతకుముందు ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద జిల్లా పరిపాలనా న్యాయమూర్తికి జిల్లా ప్రధాన న్యాయమూర్తితోపాటు కలెక్టర్ షన్మోహన్, జడ్పీ సీఈవో ప్రభాకర్ రెడ్డి, చిత్తూరు ఆర్డీవో చిన్నయ్య తదితరులు సాదర స్వాగతం పలికారు. ఈ సమావేశంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఐ.కరుణకుమార్, 8వ అదనపు జిల్లా జడ్జి ఎస్.శ్రీదేవి, అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌పీడీ వెన్నెల, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి డి.ఉమాదేవి, 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి మాధవి, 3వ అదనపు ఒకటో తరగతి మెజిస్ట్రేట్ ఎస్.శ్రీనివాసమూర్తి, 4వ అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ షేక్ బాబాజాన్, స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కీర్తన, ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన అదనపు సీనియర్, జూనియర్ జడ్జిలు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పరిపాలనా న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందనరావు - హాజరైన న్యాయమూర్తులు

తిరుపతిలో వైఎస్ షర్మిల

● నేడు చిత్తూరు, తిరుపతి జిల్లాల కాంగ్రెస్ శ్రేణులతో సమావేశం

తిరుపతి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల శనివారం రాత్రి తిరుపతి చేరుకున్నారు. ఆదివారం చిత్తూరు, తిరుపతి జిల్లాలకు చెందిన పార్టీ శ్రేణుల సమావేశంలో ఆమె పాల్గొంటారు. ఉదయం 10 గంటల నుంచీ మధ్యాహ్నం 12 వరకూ నగరంలోని రామతులసీ కళ్యాణ మండపంలో పార్టీ కార్యకర్తలతో సమావేశం కానున్నారు. ఆ సందర్భంగా రెండు జిల్లాల్లో పార్టీ స్థితిగతులను తెలుసుకోవడంతో పాటు పార్టీ పునర్నిర్మాణానికి సంబంధించిన దిశా నిర్దేశం చేయనున్నారు. సమావేశంలో ఆమెతో పాటు పీసీసీ మాజీ అధ్యక్షులు రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు, మాజీ కేంద్ర మంత్రి పల్లం రాజు, ముఖ్య నేతలు జేడీ శీలం, తాంతియా కుమారి, కొప్పుల రాజు, తులసిరెడ్డి, జంగా గౌతమ్, కొరివి వినయ్‌కుమార్, యువజన కాంగ్రెస్ నేత రామారావు, ఎన్ఎస్‌యూఐ నేత నాగ మధు తదితరులు సమావేశంలో పాల్గొననున్నారు.కాంగ్రెస్ పార్టీలో చేరి, పీసీసీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారిగా షర్మిల వస్తున్న నేపథ్యంలో తొలి సమావేశానికి వీలైనంత మంది కార్యకర్తలను రప్పించాలని నేతలు యత్నిస్తున్నారు. అందులో భాగంగా రెండు జిల్లాల పరిధిలో కార్యకర్తలను, పార్టీ అభిమానులను గుర్తించి వారికి వ్యక్తిగతంగా ఆహ్వానం పంపినట్లు సమాచారం.కాగా నెల్లూరు నుంచీ శనివారం రాత్రి తిరుపతి చేరుకున్న షర్మిలకు ఘన స్వాగతం లభించింది. నగరంలోని తాజ్ హోటల్ వద్ద ఆమెకు పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు జంగా గౌతమ్, రాకేష్‌రెడ్డి, పీసీపీ ఉపాధ్యక్షులు దొడ్డారెడ్డి రామ్‌భూపాల్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, ఎన్ఎస్‌యూఐ నేత మద్దెల అమృత్ తేజ తదితరులు స్వాగతం పలికారు.ఆదివారం మధ్యాహ్నం పార్టీ శ్రేణులతో సమావేశం ముగిశాక ఆమె అనంతపురం వెళ్ళనున్నారు.



షర్మిలకు తిరుపతి కాంగ్రెస్ నేతల స్వాగతం

రేపటినుంచి విద్యుత్ ఛార్జీలపై ప్రజాభిప్రాయ సేకరణ

తిరుపతి(ఆటోనగర్), జనవరి 27 : ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోని తిరుపతి సర్కిల్ (ఉమ్మడి చిత్తూరు జిల్లా)లో సోమవారం నుంచి ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణా మండలి (ఏపీఈఆర్సీ) విద్యుత్ ఛార్జీలపై ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతున్నట్లు ఎస్ఈ కృష్ణారెడ్డి శనివారం తెలిపారు. తిరుపతి టౌన్, రూరల్ డివిజన్ల పరిధిలో ఉన్న వినియోగదారులకు ఎస్ఈ కార్యాలయంలో ఆన్‌లైన్ ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందన్నారు. చిత్తూరు అర్బన్, రూరల్ డివిజన్లకు సంబంధించి రూరల్ డివిజన్ కార్యాలయంలో, పుత్తూరు డివిజన్ కార్యాలయ పరిధిలోని వినియోగదారులకు పుత్తూరులో, మదనపల్లి, పుంగనూరు డివిజన్ పరిధిలోని వినియోగదారులకు మదనపల్లెలో, పీలేరు డివిజన్ పరిధిలోని వినియోగదారులకు పీలేరు డివిజన్ కేంద్రంలో ఆన్‌లైన్ ద్వారా సోమవారం నుంచి బుధవారం వరకు మూడు రోజుల పాటు అభిప్రాయ సేకరణ జరుగుందన్నారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4.30గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఎస్ఈ తెలిపారు.

వి.కోట వైసీపీలో తారస్థాయికి వర్గ విభేదాలు

జడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే మధ్య ఇప్పటికే ప్రొటోకాల్ రగడ

కష్టపడిన వారికి గుర్తింపు లేదంటూ తాజాగా మండల నేతల అసహనం

వి.కోట, జనవరి 27: వి.కోట మండల వైసీపీలో వర్గ విభేదాలు తారస్థాయికి చేరుకున్నాయి. ఇప్పటికే జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే వెంకటేగౌడ మధ్య పదే పదే ప్రొటోకాల్ రగడ కొనసాగుతూనే ఉంది. తాజాగా ఎంపీపీ యువరాజ్.. తమకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని,మూడేళ్లుగా మండల గ్రాంట్స్ ఇష్టారాజ్యంగా వినియోగించారని ఎంపీటీసీ సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు.రెండువారాల కిందట జడ్పీ చైర్మన్ తన వర్గంతో ఆత్మీయ సమావేశం నిర్వహించి, పంచాయతీలవారీగా వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మండల పరిధిలో రెండేళ్లుగా రూ.1.5కోట్ల పనులు చేపట్టారని, కనీసం నామమాత్రమైనా తనతో చెప్పకుండా ఎలా చేశారంటూ అధికారులను ఆయన ప్రశ్నించడం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల జరిగిన మండల సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ.. తాను చేపట్టిన పనులపై క్షేత్రస్థాయిలో విచారణ జరుపుకోవాలని సవాల్ విసిరారు. 25 మంది ఎంపీటీసీ సభ్యులుండగా, పనులు కేవలం ఎంపీపీ, ఎమ్మెల్యే సెగ్మెంట్లలోనే చేశారని సమావేశం ముందే సభ్యులు ఆయన్ను ప్రశ్నించారు. రాబోయే రోజుల్లో సమానంగా పనులు కేటాయిస్తామని బుజ్జగించడంతో సభ్యులు కాస్త మెత్తబడ్డారు. రెండ్రోజుల కిందట గంధారమాకులపల్లెకు చెందిన బాలాజీకి మండల యూత్ అధ్యక్షుడిగా పదవిని ఎమ్మెల్యే ప్రకటించారు. ఎంతోమంది పార్టీ కోసం సేవలందిస్తే పట్టించుకోకుండా ఏకపక్షంగా ఎలా ప్రకటిస్తారని మండల నేతలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. మరికొందరు సోషల్ మీడియా వేదికగా.. విమర్శలు పోస్టు చేస్తున్నారు. మరోవైపు గతంలో ముస్లిం, మైనారిటీలకు కేటాయించిన యూత్ పదవిని ఇతరులకు కేటాయించడంపైనా రగిలిపోతున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో జరుగుతున్న ఈ పరిణామాలు.. జడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే మధ్య మరింత అగాధాన్ని పెంచుతున్నాయని వైసీపీ శ్రేణులే చర్చించుకుంటున్నాయి.

ఉమ్మడి జిల్లాలో పలువురు ఎస్ఐల బదిలీ

చిత్తూరు, జనవరి 27: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పలువురు ఎస్ఐలు బదిలీ అయ్యారు. చిత్తూరు జిల్లాలో పనిచేస్తున్న జీడీపీ రమణను రాయదుర్గం అర్బన్‌కు, డి.సురేంద్రబాబును గుంతకల్ టూటౌన్‌కు, కె.పద్మావతిని అనంతపురం దిశ మహిళా స్టేషన్‌కు, సుగుణను అనంతపురం వన్‌టౌన్‌కు, దాసరాజనాయక్‌ను తాడిపత్రి టౌన్ పోలీసుస్టేషన్‌కి బదిలీ చేశారు. అలాగే తిరుపతిలో పనిచేస్తున్న ఎం.శ్రీనివాసులును పెద్దవడుగూరు స్టేషన్‌కు, సి.చలపతిని అనంతపురం సీసీఎస్‌కు, ఎస్.గిరిబాబును ఎల్లనూరు స్టేషన్‌కు, ఎంఎం వెంకటేశ్వర్లును గుమ్మగట్ట స్టేషన్‌కు, ఎస్‌జీ హేమాద్రిని పుట్లూరుకు బదిలీ చేశారు. ఈ మేరకు శనివారం అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి ఉత్తర్వులు జారీచేశారు.

బీజేపీ క్లస్టర్-4 ఇన్‌చార్జిగా సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జనవరి 27: రాష్ట్రవ్యాప్తంగా జిల్లాలను ఐదు క్లస్టర్లుగా విభజించి ఇన్‌చార్జి, కో ఇన్‌చార్జిలను నియమిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందరేశ్వరి శనివారం రాత్రి జాబితా విడుదల చేశారు. ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాలను క్లస్టర్-4గా విభజించి ఇన్‌చార్జిగా తిరుపతి జిల్లా నాయుడుపేటకు చెందిన బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డిని నియమించారు. అలాగే తిరుపతి ప్రాంతానికి చెందిన బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సామంచి శ్రీనివాస్‌ను క్లస్టర్-4 కో ఇన్‌చార్జిగా నియమించారు.

జన.. ప్రభంజనం...

పీలేరు సభకు పోటెత్తిన ప్రజలు

పీలేరు, జనవరి 27 : పీలేరులో శనివారం జరిగిన రా.. కదలిరా సభకు లక్షకు పైగా జనం రావడంతో జన.. ప్రభంజనంలా మారింది. జనంతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. దీంతో అంతకుమించి జనం సమీపం లోని జాతీయ రహదారిపై ఆగిపోవలసి వచ్చింది. పీలేరు నుంచి మదన పల్లెకు వెళ్లే జాతీయ రహదారి దాదాపు ఎనిమిది కిలోమీటర్ల పొడవునా వాహనాలు, అందులో వచ్చిన జనంతో రవాణా దాదాపు పూర్తిగా స్తంభించిపోయింది.



వైసీపీ అరాచక పాలన అంతమే ధ్యేయం

రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్ రాజు



రాష్ట్రంలో సాగుతున్న వైసీపీ అరాచక, విధ్వంస పాలన అంతమే తమ ధ్యేయమని రాజంపేట పార్ల మెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్ రాజు అన్నారు. పీలేరులో జరిగిన 'రా...క దలిరా' సభలో ఆయ న మాట్లాడుతూ నాలుగున్నరేళ్లుగా వైసీపీ నాయకుడు పెడుతున్న అనేక అక్రమ కేసులు ఎదుర్కొంటూ కూడా పార్టీ పట్ల నమ్మకం కలిగి ఉన్న కార్యకర్తలందరికీ పాదాభివందనం చేస్తున్నట్లు తెలిపారు. వైసీపీ పాలన కారణంగా అభివృద్ధిలో 30 ఏళ్ల వెనక్కు వెళ్లిపోయిన రాష్ట్రం బాగుపడాలంటే చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. పీలేరు సభకు హాజరైన జనసమూహాన్ని చూసి తాడేపల్లె ప్యాలెస్‌లోని జగన్, పుంగనూరు పుడంగి పెద్దిరెడ్డి గుండెల్లో రైళ్లు పరుగెడుతుంటాయన్నారు. అధికారంతో గత నాలుగేళ్లుగా మద్యం, ఇసుక అక్రమ వ్యాపారాల్లో సంపాదించిన డబ్బు సంచులతో మళ్లీ ప్రజలను మోసం చేసేందుకు వైసీపీ నాయకులు వస్తారని వారి మాయమాటలు నమ్మి మోసపోవద్దని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వచ్చే ఎన్నికల్లో రాజంపేట పార్లమెంటు సీటుతో పాటు దాని పరిధిలోని అన్ని అసెంబ్లీ స్థానాల్లోనూ టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

ల్యాండ్, శ్యాండ్, మైన్‌తో వైసీపీ దోపిడీ

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్



వైసీపీ వారు ల్యాండ్, శ్యాండ్, మైన్-వైన్‌లతో రాష్ట్ర ప్రజలను లూటీ చేస్తున్నారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి పీలేరు సభలో ధ్వజమెత్తారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే తప్ప వైసీపీ పాలనలో 30 ఏళ్లు వెనక్కు వెళ్లిపోయిన రాష్ట్రాన్ని మళ్లీ గాడిలో పెట్టలేరన్నారు. పీలేరు నియోజకవర్గంలోని యువత కోసం తాము ఏపీఐఐసీ ఆధ్వర్యంలో సుమారు 2 వేల ఎకరాలు సేకరిస్తే వాటిలో పరిశ్రమలు స్థాపించకుండా ఇక్కడి ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రి పెద్దిరెడ్డి అన్యాయం చేశారన్నారు. పీలేరు నియోజకవర్గంలోని అన్ని మండలాలకు నీరిచ్చే ఝరికోన ప్రాజెక్టును కూడా పట్టించుకోలేదన్నారు. రాజంపేట ఎంపీ స్థానంతో పాటు దాని పరిధిలోని అన్ని ఎమ్మెల్యే స్థానాలను టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. తమ కుటుంబంపై ఎనలేని ప్రేమ, అభిమానం చూపిస్తున్న పీలేరు నియోజకవర్గ ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానని భావోద్వేగానికి లోనయ్యారు. పీలేరు సభను విజయవంతం చేసిన రాజంపేట పార్లమెంటు పరిధిలోని అన్ని అసెంబ్లీ సెగ్మెంట్ల టీడీపీ శ్రేణులు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజలే జగన్‌ను ట్రాన్స్‌ఫర్ చేస్తారు

● **కంచెర్ల శ్రీకాంత్, ఎమ్మెల్సీ**



ఎమ్మెల్యేలు, ఎంపీలను ట్రాన్స్‌ఫర్ చేస్తున్న జగన్‌ను రాష్ట్ర ప్రజలు త్వరలో రాష్ట్రం నుంచి ట్రాన్స్‌ఫర్ చేసేందుకు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే కంచెర్ల శ్రీకాంత్ తెలిపారు. నా వెంట్రుక కూడా పీకలేరని డాంబికాలు పలికిన జగన్, ప్రస్తుతం జనాగ్రహాన్ని గ్రహించి సంతోషంగా దిగిపోతానని ఓటమిని అంగీకరిస్తున్నారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలను స్ఫూర్తిగా తీసుకుని వచ్చే ఎన్నికల్లో రాజంపేట పార్లమెంటు పరిధిలోని అన్ని సెగ్మెంట్లలో టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

గంజాయాంధ్రప్రదేశ్‌గా మార్చేశారు


పసుపులేటి హరిప్రసాద్, జనసేన చిత్తూరు జిల్లా అధ్యక్షుడు



దేశానికే అన్నపూర్ణగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను ముఖ్యమంత్రి జగన్ గంజాయాంధ్రప్రదేశ్‌గా మార్చివేశారు. దేశంలో ఎక్కడ గంజాయి కేసులు బయటపడినా వాటి మూలాలు ఆంధ్రప్రదేశ్‌లో తేలుతున్నాయన్నారు. ఆయన నేతృత్వంలోని వైసీపీ గంజాయి, ఎర్రచందనం, లిక్కర్, ఇసుక మాఫియాగా మారిపోయిందని, ముఖ్యమంత్రి జగన్ మాఫియా డాన్‌గా మారిపోయారని తెలిపారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా రాష్ట్ర ప్రజలు టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నారని, చిత్తూరు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఉమ్మడి అభ్యర్థులు విజయబావుటా ఎగురవేస్తారని అన్నారు.

నాతోనే అంతమవుతావ్

చల్లా రామచంద్రారెడ్డి, పుంగనూరు



'1989లో నాపై గెలిచి రాజకీయ జీవితం ప్రారంభించావ్, ఈ ఎన్నికల్లో నా చేతుల్లో ఓడిపోయి రాజకీయంగా అంతమైపోతావ్' అంటూ మంత్రి పెద్దిరెడ్డిపై పుంగనూరు ఇన్‌ఛార్జ్ చల్లా రామచంద్రారెడ్డి(చల్లా బాబు) పీలేరు సభలో ఫైర్ అయ్యారు. పీలేరు సభను చూస్తుంటే ముఖ్యమంత్రి జగన్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వెన్నులో వణుకు పుట్టిస్తోందన్నారు. పీఎల్ఆర్ సంస్థ పేరుతో రైతులకు ఒక్కరూపాయి నష్టపరిహారం చెల్లించకుండా అక్రమంగా ప్రాజెక్టులు నిర్మిస్తున్నారని ఆరోపించారు. వారిద్దరి అధికారం అంతం అయ్యే సమయం ఆసన్నమైందన్నారు.

చంద్రబాబు సభలో హైలైట్స్

కలికిరి/కలకడ, జనవరి 27: శనివారం పీలేరులో జరిగిన టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు భారీ బహిరంగ సభ అనుకున్నదానికి మించి విజయవంతమైంది. రాజంపేట పార్లమెంటు పరిధిలో జరిగిన ఈ సభకు రాజంపేట, కోడూరు, రాయచోటి, మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, పుంగనూరు నుంచి జనాలు హాజరయ్యారు. లక్షకు పైబడి జనం హాజరయ్యారని చెబుతుండగా అందులో సగం మంది జాతీయ రహదారిపై ఏడెనిమిది కిలోమీటర్ల మేర ఇరుక్కుపోయారు. మొత్తానికి జనసందోహాన్ని చూసిన పార్టీ వర్గాలు మాత్రం ఉబ్బితబ్బియ్యారు. ఇక సభలో కనపడిన విశేషాలు..

- వాతావరణం ఆహ్లాదకరంగా మారడంతో ప్రకృతి కూడా సహకరించిందని వేదికపై నుంచి పలువురు సంతోషం వ్యక్తం చేశారు.
- అవసరమైన వారందరికీ అడుగడుగునా మంచినీళ్లు, మజ్జిగ ప్యాకెట్లు విస్తృతంగా అందుబాటులో ఉంచారు.
- చంద్రబాబు షెడ్యూలు మేరకు సరిగ్గా 11.50 గంటలకు హెలికాప్టర్ ద్వారా సభా ప్రాంగణానికి చేరుకున్నారు. 12.20కి వేదిక పైకి వచ్చారు. 12.44కు ఉపన్యాసం ప్రారంభించి దాదాపు గంటకు పైబడి మాట్లాడారు.
- సభ జరుగుతున్న మైదానం పైన ఐదారు డ్రోన్లు నిరవధికంగా సంచరిస్తూ కనిపించాయి. ఇందులో పోలీసులకు చెందిన డ్రోన్ కూడా ఉందని చెబుతున్నారు. అతి పెద్ద డ్రోన్ ఒకటి చంద్రబాబు ప్రయాణిస్తున్న హెలిక్యాప్టర్ పైభాగంలో దానిని అనుసరిస్తూ వచ్చింది.
- సభా స్థలిలో జనాన్ని నియంత్రించకపోవడంతో బారికేడ్లు మొత్తం చెల్లాచెదురయ్యాయి. దీంతో జనం ఒక్కసారిగా వేదిక వద్దకు పోటెత్తారు. పెద్ద సంఖ్యలో యువకులు టీడీపీ జెండాలు చేతబట్టి జై జై నినాదాలు కొనసాగించారు. దీంతో చంద్రబాబు తన ప్రసంగాన్ని చాలాసేపు ఆపేశారు.
- సభ జరుగుతున్న మైదానంపైన చంద్రబాబు, కిశోర్‌కుమార్‌రెడ్డి ఫొటోలతో కూడి బెలూన్లు ఎగురవేశారు
- చంద్రబాబు ప్రసంగం సగం పూర్తయినా జాతీయ రహదారిపై నుంచి జనం సభా స్థలికి క్యూ కట్టి వస్తూనే కనిపించారు.
- సరిగ్గా 12.50 మైకులు పనిచేయక ఆగిపోయాయి. వేదిక వద్దకు జనాలు చేరడంతో మైకులకు అంతరాయం కలిగింది. పది నిమిషాల తరువాత పునరుద్ధరించారు.
- బారికేడ్లు ఛేధించుకుని జనం ఒక్క పెట్టున వేదిక ముందుకు రావడంతో జనంలో కసి బాగా కనిపిస్తోంది.
- పీలేరు గర్జిస్తోంది.. ఇక యుద్ధానికి సిద్ధం.. కురుక్షేత్ర సంగ్రామానికి సంసిద్ధం అంటూ పదే పదే చంద్రబాబు ఆవేశంగా ప్రసంగించారు.

సార్...మీరు కాసింత లిబరల్‌గా ఉండాలి!

● **చంద్రబాబుకు నల్లారి అమరనాథరెడ్డి విజ్ఞప్తి**



'సార్, మీరు పరిపాలనలో స్ట్రిక్టుగా ఉండండి. కార్యకర్తల విషయంలో కాస్త లిబరల్‌గా ఉండాలి. గడిచిన ఐదేళ్లలో మన పార్టీ వాళ్లను వైసీపీ వారు అనేక ఇబ్బందులు పెట్టారు. మనం అధికారంలోకి వచ్చిన తరువాత వారి లెక్క తేల్చాలి. అక్రమంగా కేసులు పెట్టిన వారి భరతం పట్టాలి. ఆ సమయంలో మీరు మా మాట వినాలి. మీరు స్ట్రిక్టుగా ఉంటే కార్యకర్తలు నొచ్చుకుంటారు. వైసీపీకి చివరి రోజులు నడుస్తున్నాయని, త్వరలో జరిగే ఎన్నికల తరువాత అది శాశ్వతంగా మూతపడిపోతుందన్నారు. ఇప్పటికే ఆ పార్టీకి అభ్యర్థులు దొరకడం లేదన్నారు. స్వంత చెల్లెలికి న్యాయం చేయలేని వాడు తమకు ఎటువంటి సాయం చేయలేడన్న నిర్ణయానికి రాష్ట్ర ప్రజలు వచ్చేశారన్నారు.

ఉమ్మడి కడపనుంచి జిల్లాకు 15మంది ఎంపీడీవోల బదిలీ

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 27: ఉమ్మడి కడప జిల్లాలో ఎంపీడీవోలుగా పనిచేస్తున్న వారిలో నుంచి 15 మందిని మన జిల్లాకు బదిలీచేస్తూ శుక్రవారం పంచాయతీరాజ్ కమిషనర్ సూర్యకుమారి ఉత్తర్వులు జారీచేశారు. ఉమ్మడి కడప జిల్లా నుంచి ఎ.జగదీశ్వర్‌రెడ్డి, జి.కృష్ణమూర్తి, ఎస్.నూర్జహాన్, పి.వీరప్రసాద్, సి.వెంకటేశు, బి.మైథిలి, కె.కుళ్ళాయమ్మ, టి.వెంగముని రెడ్డి, సి.రామకృష్ణయ్య, పి.మహబూబ్ బీ, జి.రవికుమార్ రెడ్డి, సి.వెంకటరమణయ్య, జె.సుజాతమ్మ, జి.రెడ్డయ్య, కె.వి.శ్రీధర్ నాయుడు చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు. వీరు 2024 జనవరి 30వ తేదీనాటికి ఉన్న స్థానాలనుంచి రిలీవ్ అయి పోస్టింగ్స్ ఇచ్చిన చోట బాధ్యతలు చేపట్టనున్నారు.

ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్ పరీక్షలు

చిత్తూరు (సెంట్రల్), జనవరి 27: చిత్తూరులోని శ్రీనివాస ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ (సీటమ్స్)లో జేఈఈ మెయిన్స్ పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం, మధ్యాహ్నం రెండు షిఫ్టుల్లో పరీక్షలు నిర్వహించారు. ఉదయం జరిగిన పరీక్షకు 128 మంది విద్యార్థులకుగాను 124మంది హాజరవగా, నలుగురు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 128 మందికిగాను 122 మంది హాజరవగా, ఆరుగురు గైర్హాజరైనట్లు జేఈఈ మెయిన్స్ సిటీ కోఆర్డినేటర్ సుబ్రహ్మణ్యం తెలిపారు.



విద్యార్థుల అడ్మిట్ కార్డును పరిశీలిస్తున్న సిబ్బంది

ఆపదలో కోడికత్తి శీను ప్రాణాలు

కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 27: 'కోడికత్తి శీను ప్రాణాలు ఆపదలో ఉన్నాయి. జైల్లోనే చంపేసినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు' అని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ ఒకప్పటి కోడికత్తి ఘటనపై విశాఖపట్టణం విమానాశ్రయం అధికారులతో తాను మాట్లాడానంటూ, ఎన్నికలకు ముందు ప్రచారం కోసం ఒక మాజీ మంత్రి ఇచ్చిన సలహాతో కోడికత్తి రక్తపు డ్రామా ఆడారని అన్నారు. అసలు జగన్ చొక్కాకు అంటుకున్న రక్తం ఎవరిదో ఫోరెన్సిక్ పరీక్షలు చేస్తే అసలు గుట్టు బయటపడుతుందని అన్నారు. ఐదేళ్లుగా ఓ దళితుడిని జైల్లో నిర్బంధించి బెయిల్ కూడా రాకుండా చేస్తున్నారని, అసలు జగన్ ఎందుకు కోర్టు ముందుకు రావడంలేదు? ఇందువల్ల అనుమానాలు మరింత పెరుగుతున్నాయన్నారు.

విద్యుత్ ప్రమాదంలో వైరుదొంగ మృతి

దొరవారిసత్రం, జనవరి 27: ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి వైరును అపహరించే ప్రయత్నంలో విద్యుత్ ప్రమాదానికి గురై ఓ దొంగ మృతి చెందాడు.పోలీసుల కథనం మేరకు ... తిరుపతి జిల్లా డక్కిలి మండలం మాధవయ్యపాళెం గ్రామానికి చెందిన రమేష్(31)తరచూ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి రాగి వైరు అపహరిస్తుంటాడు. ఇతనిపై పలు స్టేషన్లలో కేసులు కూడా నమోదయ్యాయి.దొరవారిసత్రం మండలంలోని నెలబల్లివాసమ్మ గుడి ఎదురుగా జాతీయ రహదారి పక్కన గల అడవిలో వున్న ట్రాన్స్‌ఫార్మర్ కొంతకాలం క్రితం పాడైంది.దీన్ని గమనించిన రమేష్ ఆ ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి వైరును అపహరించేందుకు శుక్రవారం రాత్రి ప్రయత్నం చేశాడు.అయితే ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ సరఫరా ఉండడంతో షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు.శనివారం సాయంత్రం స్థానికులు రమేష్ శవాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు.మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిరుమలరావు తెలిపారు.



మృతి చెందిన రమేష్

మా డబ్బులిప్పించండి

పోలీసుల చుట్టూ తిరుగుతున్న 'లిల్లీ' యాప్ బాధితులు

పుంగనూరు, జనవరి 27: పుంగనూరులో దాదాపు రూ.7కోట్లకు బోర్డు తిప్పేసిన లిల్లీ ఇన్వెస్ట్‌మెంట్ లోన్ యాప్ కంపెనీలో డబ్బు కట్టిన బాధితులంతా పోలీసుల చుట్టూ తిరుగుతున్నారు. ఇప్పటికే యాప్ కంపెనీ ప్రథమ ఏజెంట్, పుంగనూరుకు చెందిన నౌహీరాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శనివారం ఆ కంపెనీకి చెందిన ల్యాప్‌టాప్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. దాంతో బాధితులంతా పోలీస్‌స్టేషన్‌కి వస్తున్నారు. ఎలాగైనా తమ డబ్బులిప్పించాలని పోలీసులను వేడుకుంటున్నారు.

29న ఇంటర్ తత్కాల్ ఫీజు గడువు

తిరుపతి(విద్య), జనవరి 27: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన తత్కాల్ స్కీమ్ ఫీజు గడువు ఈ నెల 29వ తేదీతో ముగుస్తుందని ఆర్ఐవో జీవీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. జనరల్, ఒకేషనల్ విభాగంలో ఇంటర్మీడియట్ కోర్సులు చదివే రెగ్యులర్, అనుతీర్ణులైన విద్యార్థులు రూ.3వేల అపరాధ రుసుంతో ఈ నెల 29న సాయంత్రం 5గంటల్లోపు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించే వెసులుబాటు ఉందని, దీన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.37 కోట్లు

తిరుమల, జనవరి27(ఆంధ్రజ్యోతి) : తిరుమల వేంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.3.37 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించి శనివారం ఉదయం ప్రకటించింది. ఇక, శుక్రవారం 71,664 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 33,330 మంది తలనీలాలు సమర్పించారు.

'రా.. కదలిరా' కోసం..

కల్లూరు/రొంపిచెర్ల, జనవరి 27: పీలేరులో శనివారం నిర్వహించిన రా... కదలిరా చంద్రబాబు బహిరంగ సభకు పులిచెర్ల, రొంపిచెర్ల మండలాల నుంచి టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు శనివారం పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. పులిచెర్లలో తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామనాథంనాయుడు టీడీపీ జెండా ఊపి ఈ ర్యాలీని ప్రారంభించారు. రొంపిచెర్ల క్రాస్ మీదుగా పీలేరు సభకు వీరు తరలివెళ్లారు.



రొంపిచెర్ల నుంచి పీలేరుకు టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తల బైక్ ర్యాలీ

తిరుపతి టీడీపీ ఎంపీ అభ్యర్థిగా నీహారిక?



తిరుపతి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): తిరుపతి లోక్‌సభ స్థానానికి టీడీపీ అభ్యర్థిగా రిటైర్డు ఐఏఎస్ అధికారి రత్నప్రభ కుమార్తె అంగలకుర్తి నీహారిక పేరు ఖరారైనట్టు తెలుస్తోంది. ఈమె సత్యవేడు మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎంపీ తలారి మనోహర్ చిన్న కోడలు కూడా. నిజానికి తిరుపతి ఎంపీ అభ్యర్థిగా కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి పేరునే పరిశీలించారని, అయితే ఆమె ఎంపీగా పోటీ చేసేందుకు ఆసక్తి చూపడం లేదని, తన భర్తకు అసెంబ్లీ టికెట్ కోరుతున్నారని సమాచారం. దీంతో ప్రత్యామ్నాయంగా పలు పేర్లను పరిశీలించారు. ఈ క్రమంలోనే గత తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల్లో బీజేపీ తరపున పోటీచేసిన రిటైర్డు ఐఏఎస్ అధికారి రత్నప్రభ కుమార్తె నీహారిక పేరు టీడీపీ అధిష్ఠానం దృష్టికి వచ్చినట్లు తెలుస్తోంది. ఆమె టీడీపీ తొలితరం రాజ్యసభ సభ్యుడు, సత్యవేడు మాజీ ఎమ్మెల్యే తలారి మనోహర్ చిన్న కోడలు. మనోహర్ పెద్ద కుమారుడు తలారి ఆదిత్య 2014-19 నడుమ సత్యవేడు ఎమ్మెల్యేగా టీడీపీ నుంచీ గెలిచిన సంగతి తెలిసిందే. విద్యాధికురాలైన యువతి కావడం, తల్లి సీనియర్ బ్యూరోక్రాట్‌గా పనిచేసివుండడం, భర్త వైపు నుంచీ మామ, బావ ఎంపీ, ఎమ్మెల్యేలుగా పనిచేసి వుండడంతో ఆమె తిరుపతి ఎంపీ స్థానానికి దీటైన అభ్యర్థి కాగలదని టీడీపీ అధిష్ఠానం భావిస్తోంది. తిరుపతి లోక్‌సభ నియోజకవర్గంలో టీడీపీకి సాంప్రదాయకంగా వున్న బలానికి తోడు పొత్తు కారణంగా జనసేన మద్దతు అదనపు బలం కానుంది. నీహారిక అభ్యర్థిత్వాన్ని అధిష్ఠానం త్వరలో అధికారికంగా ప్రకటించే అవకాశముంది.

16న రథసప్తమి

ఒకేరోజు ఏడు వాహనాలపై శ్రీవారి దర్శనం

తిరుమల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సూర్యజయంతి సందర్భంగా వచ్చేనెల 16న తిరుమలలో రథసప్తమి జరుగనుంది. ఒకేరోజు శ్రీవారు ఏడు వాహనాలపై కొలువుదీరి భక్తులకు దర్శనమివ్వనున్నారు. వేకువజాము సూర్యప్రభ వాహనంతో రథసప్తమి వేడుకలు మొదలవుతాయి. తర్వాత చిన్నశేషవాహనం, గరుడవాహనం, హనుమంతవాహనం, చక్రస్నానం, కల్పవృక్షవాహనం, సర్వభూపాల వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనంతో వేడుకలు ముగుస్తాయి. అలాగే ఫిబ్రవరి నెలలో 9వ తేదీన పురందరదాసుల ఆరాధనోత్సవం, 10న తిరుకచ్చినంబి ఉత్సవారంభం, 14న వసంతపంచమి, 19న తిరుకచ్చినంబి శాత్తుమొర, 20న భీష్మ ఏకాదశి, 21న కులశేఖరాళ్వార్ వర్ష తిరునక్షత్రం, 24న కుమారధార తీర్థ ముక్కోటి, మాఘ పౌర్ణమి గరుడసేవ ఉత్సవాలు జరగనున్నాయి.

ఎస్వీబీసీ ట్రస్టుకు రూ.20 లక్షల విరాళం

తిరుమల, జనవరి27(ఆంధ్రజ్యోతి) : టీటీడీ శ్రీవేంకటేశ్వర భక్తి ఛానల్(ఎస్వీబీసీ) ట్రస్టుకు శనివారం రూ.20 లక్షలు విరాళంగా అందింది. అమెరికాలో నివాసముంటున్న ఎన్ఆర్ఐ భక్తుడు చంద్రశేఖర్ ఎస్వీబీసీ ట్రస్టుకు రూ.10 లక్షలు అందజేశారు. తమ ప్రతినిధి తిరుపతికి చెందిన రాఘవేంద్రతో కలిసి తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో ఈవో ధర్మారెడ్డికి చెక్‌ను అందజేశారు. అలాగే హైదరాబాద్‌కు చెందిన సుధాకర్, కృష్ణారావు, లక్ష్మీబాయ్ కూడా ఎస్వీబీసీ ట్రస్టుకు మరో రూ.10 లక్షలు విరాళంగా అందజేశారు. విరాళం చెక్‌ను తిరుమలలో ఈవో ధర్మారెడ్డికి అందజేశారు.

ఉద్యోగం చేయొద్దన్నందుకు వివాహిత ఆత్మహత్య

తిరుపతి(నేరవిభాగం), జనవరి 27 : ఉద్యోగం చేయొద్దన్నందుకు ఓ వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం తిరుపతిలో చోటుచేసుకుంది. ఈస్ట్ ఎస్ఐ పురుషోత్తంరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... తిరుపతి అశోక్‌నగర్‌కు చెందిన ధనరాజ్ సివిల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు కర్ణాటక రాష్ట్రం గంగావతికి చెందిన జ్యోతిక (23)తో సంవత్సరం క్రితం వివాహమైంది. బీటెక్ చదివిన జ్యోతికకు ఉద్యోగం చేయడమంటే ఇష్టం. తాను కూడా ఉద్యోగం చేస్తానని నిత్యం అడుగుతుండేది. ఆ ప్రతిపాదనను భర్త తిరస్కరించేవాడు. ఇదే విషయమై శుక్రవారం రాత్రి ఇద్దరి మధ్య గొడవ జరిగింది. మనస్థాపం చెందిన జ్యోతిక భర్త స్నానం చేసి వచ్చే లోపల గదిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఈస్ట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఆత్మహత్యకు పాల్పడిన జ్యోతిక

అలరించిన త్యాగరాజ సంకీర్తనలు



త్యాగరాజ కృతులను ఆలపిస్తున్న సంగీత విద్వాంసులు

పలమనేరు, జనవరి27 : పలమనేరులో శనివారం గంగమ్మ తోపు వద్ద త్యాగరాజకీర్తనలను సంగీత విద్వాంసులు ఆలపించారు. త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో భాగంగా ఇక్కడి తెలుగుసాహిత్యసాంస్కృతిక సంస్థ, బెంగళూరుకు చెందిన జాయినింగ్‌ద డాట్స్ సంస్థ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో సంగీత విద్వాంసులు సాయితేజస్, చంద్రశేఖర్ స్వరం, నాగరాజు మృదంగం, సచిన్‌దేవీప్రసాద్ ఘటం, అర్జున్ దినకర్ వయోలిన్ లతో ఆలపించిన త్యాగరాజకృతులు పట్టణ వాసులను అలరించింది. ఈ సందర్భంగ సంస్థల ప్రతినిధులు సంగీత విద్వాంసులను ఘనంగా సత్కరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ధనంజయ, వాణి, రాఘవేంద్ర, తులసినాథంనాయుడు, బాలసుందరం, సిద్దార్థ, రజని, పుష్ప పాల్గొన్నారు.

సోమలలో హోరాహోరీగా ఉద్యోగుల క్రీడలు



బహుమతులు కైవశం చేసుకున్న జట్టు

సోమల, జనవరి 27: సోమల హైస్కూల్‌లో శనివారం ప్రభుత్వ ఉద్యోగుల స్నేహ పూర్వక క్రీడలు కోలాహలంగా జరిగాయి. క్రికెట్, కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్ పోటీలను జడ్పీటీసీ కుసుమ, తహసీల్దార్ శ్యాంప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. క్రికెట్ మ్యాచ్ విజేతగా మండల అధికారుల టీమ్, రన్నర్స్‌గా సచివాలయ ఉద్యోగుల టీమ్, కబడ్డీలో సచివాలయ ఉద్యోగులు, రన్నర్స్‌గా మండల అధికారుల టీమ్, బాడ్మింటన్ మహిళా విభాగంలో సుకన్య, బిందు మాధవి విజేతలుగా నిలిచారు. బ్యాడ్మింటన్ పురుషుల విభాగంలో హరిహరి బ్రహ్మ, రవితేజ జట్టు, రన్నర్స్‌గా సుధాకర్, సందీప్ బహుమతులు స్వీకరించారు. అలాగే నవీన్ (జేఎల్ఎం) అధిక వికెట్‌లు తీసుకోవడంతో అవార్డు స్వీకరించారు. క్రీడా పోటీలను పీడీ కరుణానిధి, రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల ఈసీ మెంబర్ లోకేశ్ పర్యవేక్షించారు. వైస్ఎంపీపీ ప్రభాకర్, సాంబశివయ్య, కార్యదర్శులు బహుమతులు అందజేశారు. అలాగే సచివాలయ ఉద్యోగుల క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి



సుగాలిమిట్టలో ప్రజలను కలుస్తున్న కాంగ్రెస్ నేత రామకృష్ణారెడ్డి

పుంగనూరు రూరల్, జనవరి27: గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేయడానికి తన వంతు కృషి చేస్తానని పుంగనూరు నియోజకవర్గ కన్వీనర్ సింగం రామకృష్ణారెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని ఈడిగపల్లె, సుగాలిమిట్ల గ్రామాల్లో ఆయన పర్యటించి కాంగ్రెస్ పార్టీని ప్రజల్లోకి తీసుకెళుతున్నట్లు ఆయన వివరించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఈశ్వర్, దివ్యానంద్, శ్రీదేవి, సైదాని, శ్రీనివాసులురెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేశాం.. ఆదరించండి : ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

పెద్దపంజాణి, జనవరి 27: అభివృద్ధి చేశాం ఆదరించాలని ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. శనివారం పెద్దపంజాణిలో వైఎస్సార్ ఆసరా నాల్గవ విడత నిధుల మంజూరుకు సంబంధించి లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 1111 గ్రూపులలోని 10641 మంది మహిళలకు నాలుగు విడతలుగా రూ.44.75 కోట్లు అందించామన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు ఆర్వీఎస్ బోస్, ఎంపీపీ రెడ్డెప్ప, జడ్పీటీసీ సుష్మకీర్తి,అధికారులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు ఆసరా సొమ్ము పంపిణీ



ఆసరా చెక్కును అందిస్తున్న ఎమ్మెల్సీ భరత్

కుప్పం, జనవరి 27: కుప్పం పట్టణంలో జరిగిన ఆసరా కార్యక్రమంలో 746 సంఘాలకు రూ.7.9 కోట్ల చెక్కును ఎమ్మెల్సీ భరత్ చేతుల మీదుగా అందజేశారు. శనివారం పట్టణంలోని 3వ సచివాలయంలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయనని సంక్షేమ పథకాలను సీఎం జగన్‌రెడ్డి అమలు చేశారన్నారు. కార్యక్రమంలో ఎంపీ రెడ్డెప్ప, మున్సిపల్ చైర్మన్ డా.సుధీర్, ఇతర నేతలు అదికారులు పాల్గొన్నారు.

చెన్నకేశవస్వామికి ప్రత్యేక పూజలు



రొంపిచెర్ల : బొమ్మయ్యగారిపల్లెలోని చెన్నకేశవస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. హరిస్వామి చెన్నకేశవస్వామి, ఆంజనేయస్వామి విగ్రహ మూర్తులకు అభిషేకాలు, అర్చనలు, తమలపాకుల హారాలు వేసి పూజలు చేశారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ సభ

బైరెడ్డిపల్లె, జనవరి 27 : మండలంలో చేపట్టిన ఉపాధిపనులకు సంబంధించి సామాజిక తనిఖీ ప్రజావేదిక సభను శనివారం స్థానిక మండలపరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రెడ్డెప్ప, బైరెడ్డిపల్లె ఎంపీపీ రెడ్డెప్ప పాల్గొని సమీక్షించారు. మండలంలో జరిగిన వివిధ పనులకు సంబంధించి రూ. 2లక్షల 18వేల 456 అవకతవకలు వున్నట్లు గుర్తించి ఆ మొత్తాన్ని సంబంధిత సిబ్బంది నుంచి రికవరీ చేయాలని డ్వామా పీడీ గంగాభవాని, విజిలెన్స్ అధికారి భాగ్యలక్ష్మి ఈజీఎస్ ఏపీవో హరినాథ్‌ను ఆదేశించారు. అలాగే విధినిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందికి షోకాజ్ నోటీసు ఇవ్వాలని ఆదేశించారు. కూలీలకు సక్రమంగా పనులు కల్పించి ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన ఉపాధిహామీ పథకం అమలుపై సంబంధిత సిబ్బంది ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని ఎంపీ రెడ్డెప్ప సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డెప్ప, ఎంపీడీవో రాజేంద్రబాలాజీ పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఎంపీ రెడ్డెప్ప

ఖోఖోలో పెద్దపంజాణి, బ్యాడ్మింటన్‌లో బైరెడ్డిపల్లి విజేతలు



ఖోఖో విజేతలు



బ్యాడ్మింటన్ విజేతలు

పలమనేరులో శనివారం జరిగిన నియోజకవర్గ స్థాయి ఖోఖో పోటీల్లో పెద్దపంజాణి బాలికలు, బ్యాడ్మింటన్‌లో బైరెడ్డిపల్లి యువకులు విజేతలుగా నిలిచారు. పలమనేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన ఈ క్రీడలను ప్రచారకర్త శివయ్య పర్యవేక్షించారు. విజేతలను ఎంపీడీఓ విద్యాసాగర్ శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. విజేతలు జిల్లా స్థాయిలో జరిగే క్రీడల్లో పాల్గొంటారని ఎంపీడీఓ తెలిపారు. - పలమనేరు

ఎన్నికల సమరానికి సిద్ధంకండి : టీడీపీ

కుప్పం, జనవరి 27: త్వరలో జరగనున్న ఎన్నికలకు టీడీపీ శ్రేణులు సమాయత్తం కావాలని కుప్పం టీడీపీ ఇన్‌చార్జ్ పీ.ఎస్.మునిరత్నం అన్నారు. శనివారం కుప్పంలో జరిగిన టీడీపీ క్లసర్ ఇన్‌ఛార్జుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో పార్టీ ఓటర్ల జాబితాపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. తమ అధినేత చంద్రబాబుకు ఈసారి ఎన్నికల్లో అత్యధిక మెజారిటీ సాధించేందుకు బూత్ లెవల్‌లో అందరూ సమన్వయంతో పనిచేయాలని పార్టీ కేడర్‌కు సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కుప్పం ఇన్‌చార్జ్ పీఎస్ మునిరత్నం

రా...కదిలిరా సభకు తరలిన టీడీపీ శ్రేణులు







పీలేరులో జరిగే చంద్రబాబు సభకు పుంగనూరు, పులిచెర్ల, చౌడేపల్లె మండలాల నుంచి వెళుతున్న టీడీపీ శ్రేణులు

పుంగనూరు, జనవరి27: పీలేరులో చేపట్టిన రా...కదిలిరా.. సభకు పుంగనూరు నుంచి శనివారం భారీ సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. టీడీపీ పట్టణ, మండల నాయకులు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపు ఖాయమని, ఇప్పటికే అధికార పక్షనాయకులకు గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎం. శ్రీకాంత్, నాయకులు మాధవరెడ్డి, సుహేల్‌బాషా, సుబ్రహ్మణ్యంరాజు, ఆసూరిబాలాజీ, సీవీరెడ్డి, దేశాద్రిప్రకాశ్, కుమార్, గంగాధర్, రెడ్డెప్ప, రామయ్య, సద్దాం హుస్సేన్, ప్రసాద్‌స్వామి, రమణ, జనసేన నాయకులు పగడాల రమణ, విరూపాక్షి, నరేశ్ రాయల్, చైతన్యరాయల్, హరినాయక్, బాలాజీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు: పీలేరు పట్టణం శివారులో శనివారం నిర్వహించిన రా కదలిరా చంద్రాబాబు బహిరంగ సభకు పులిచెర్ల మండలం నుంచి టీడీపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. మండలంలోని 25 గ్రామ పంచాయతీల నుంచి ముందుగా పులిచెర్లకు నాయకులు, కార్యకర్తలు బైక్‌లతో చేరుకున్నారు. పులిచెర్లలో రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షుడు రామనాథంనాయుడు టీడీపీ జెండా ఊపి బైక్ ర్యాలీ ప్రారంభించారు. అక్కడి నుంచి రొంపిచెర్ల క్రాస్ మీదుగా పీలేరు సభకు ర్యాలీగా తరలివెళ్లారు.

చౌడేపల్లె : పీలేరులో జరిగే టీడీపీ అధినేత చంద్రబాబాబు బహిరంగ సభకు చౌడేపల్లె మండలం నుంచి భారీగా తరలి వెళ్లారు. శనివారం టీడీపీ మండలాధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో 40 కార్లలో టీడీపీ కార్యకర్తలు, నాయకులు తరలి వెళ్లారు. కార్యక్రమంలో నాయకులు బోయకొండ సుబ్బు, లక్ష్మీపతిరాజు, గిరిరాజు, హరిప్రసాద్, ప్రభాకర, విజయభాస్కర్‌రెడ్డి, కుమార్‌రెడ్డి, మహ్మద్‌గని, కల్యాణ్, రెడ్డి, శివశంకర్‌రాజు, సుబ్రహ్మణ్యం, మునవెంకటప్ప, మునివెంకటరమణ, రమణ, చంగల్రాయుడు, బాబునాయుడు, కార్తిక్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.



పీలేరులో జరిగిన రా.. కదలిరా బహిరంగ సభ వేదికపై చంద్రబాబు నాయుడుతో రాజంపేట పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు



సభా వేదికపై రాయచోటి మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథరెడ్డి



పీలేరులో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాజంపేట పార్లమెంట్ టీడీపీ కార్యదర్శి ఆసూరి బాలాజీ



చంద్రబాబుతోపాటు బస్సు దిగుతున్న జడ్పీ మాజీ చైర్మన్, రాజంపేట పార్లమెంటు నేత సుగవాసి బాలసుబ్రమణ్యం

వరసిద్ధుడి సేవలో వినియోగదారుల ఫిర్యాదులు, పరిష్కారాల కమిషన్ చైర్మన్

ఐరాల(కాణిపాకం), జనవరి 27: రాష్ట్ర వినియోగదారుల ఫిర్యాదులు, పరిష్కారాల కమిషన్ చైర్మన్ జస్టిస్ టి.సునీల్‌చౌదరి కుటుంబ సమేతంగా శనివారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. వారిని ఏఈవో ఎస్వీకృష్ణారెడ్డి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.



పేదలకు అన్నదానం



పుంగనూరు రూరల్, జనవరి27: శ్రీకృష్ణదేవరాయల జయంతి సందర్భంగా పుంగనూరు రాయల్ పీపుల్స్ ప్రంట్ సభ్యులు పేదలకు అన్నదానం చేశారు. శనివారం స్థానిక ఇందిరాసర్కిల్‌లో ఆయన చిత్రపటం ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో రాయల్‌పీపుల్స్ ప్రంట్ సభ్యులు జనార్ధన్‌రాయల్, హేమంతకుమార్‌రాయల్, నానబాలకుమార్, మల్లికా రాయల్, పెద్దమఠం బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి పెద్దిరెడ్డి పర్యటన

పుంగనూరు, జనవరి27: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పుంగనూరులో ఆదివారం పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నట్లు మంత్రి పీఏ చంద్రహాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 28న ఉదయం 8-30గంటలకు పుంగనూరు మండలం నెక్కుంది సమీపంలో వెలసిన అగస్త్యేశ్వర స్వామి ఆలయం వద్ద కల్యాణ మండపం ప్రారంభోత్సవం, 9-15 గంటలకు బైపాస్ రోడ్డు సమీపంలో ఆర్డీవో కార్యాలయానికి భూమి పూజ, శంకుస్థాపన జరుగుతుందని ఎంపీపీ సుప్రజ తెలిపారు. అలాగే రాంపల్లె వద్ద మసీదు ప్రారంభోత్సం, 10.30గంటలకు గూడూరుపల్లె వద్ద పేదలకు ఇంటి పట్టాలు పంపిణీ తదితర కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు.

ఎస్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



పెద్దపంజాణి, జనవరి 27: ఎస్టీయూ నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను శనివారం ఎమ్మార్సీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఎస్టీయూ మండల అద్యక్షుడు బాబురెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు జయరామయ్య, ప్రధాన కార్యదర్శి గురుప్రసాద్, సీనియర్ నాయకులు మారెళ్ళ భాస్కర్, ఎస్టీయూ ఉపాధ్యాయులందరూ హాజరయ్యారు.

దాడిపై కేసు నమోదు

పుంగనూరు రూరల్, జనవరి27: పాతకక్షలతో తనపై దాడి చేశారంటూ బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ నాగరాజు తెలిపారు. ఆయన కథనం మేరకు ... వనమలదిన్నె పంచాయతీ ఓబిరెడ్డిపల్లెకు చెందిన సీతయ్య కుమారుడు కె.శ్రీనివాసులు, అదే గ్రామానికి చెందిన కె.వెంకటరమణలకు పాత గొడవలు ఉన్నాయి. దీంతో శ్రీనివాసులు, భార్య మల్లిక ఇంటిలో ఉండగా వెంకటరమణ, అతని కుటుంబసభ్యులు కుమార్, గంగాధర్, శాంతమ్మలు గొడవ పడ్డారు. దీంతో శ్రీనివాసులు బావ వై. నరసింహులు ఇరువర్గాలకు సర్ది చెప్పడానికి వెళ్లగా వెంకటరమణ వర్గీయులు అతనిపై కూడా దాడి చేసి గాయపరిచినట్లు ఫిర్యాదులో పేర్కొనట్లు తెలిపారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

కుప్పం, జనవరి 27: కుప్పం మండలం డీకేపల్లె సమీపంలోని ఎంఎల్ఆర్ ఫ్యాక్టరీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. శనివారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఒకరు పలార్లపల్లె గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ వెంకటేష్‌గా స్థానికులు గుర్తించారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్ ద్వారా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



క్షతగాత్రుడు

షాదీమహల్ పనుల పరిశీలన



సోమల, జనవరి 27: సోమల-కందూరు మార్గంలో జరుగుతున్న షాదీమహల్ నిర్మాణ పనులను శనివారం పీఆర్ ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి పరిశీలించి కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పరిశీలించారు. అలాగే కందూరు, పెద్దఉప్పరపల్లెలో జరుగుతున్న పనులను, ఎంపీడీవో కార్యాలయం వద్ద సమావేశ భవనంలో అదనపు నిర్మాణాలను పరిశీలించారు. జడ్పీటీసీ కుసుమ, ఏఎంసీ మాజీ చైర్మన్ మోహన్, ముతవల్లి ఖాదర్‌బాషా, జేఈ ఆనంద్ పాల్గొన్నారు.

రక్షణ కోరిన ప్రేమ జంట

చిత్తూరు సిటీ, జనవరి 27: ప్రేమించి పెళ్లి చేసుకున్నామని, తమ పెద్దల నుంచి రక్షణ కల్పించాలని ప్రేమ జంట మీడియాను ఆశ్రయించింది. శనివారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో గుడిపాల మండలం చెరువు ముందర ఊరుకు చెందిన కాంచన, భరత్ విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ తాము ఇద్దరం ప్రేమించుకున్నామని, తమ కులాలు వేరుకావడంతో పెద్దలు పెళ్లికి అంగీకరించలేదని చెప్పారు. పెద్దలకు తెలియకుండా పెళ్లి చేసుకున్నామని, ఇరు కుటుంబాల పెద్దల నుంచి తమకు రక్షణ కల్పించాలని వారు కోరారు.

షార్ట్ సర్క్యూట్‌తో చెరకు తోట దగ్ధం

తవణంపల్లె, జనవరి 27: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో చెరకు తోట దగ్ధమై రూ.3 లక్షలు విలువైన పంట నష్టం వాటిల్లిన ఘటన తవణంపల్లె మండలంలో శనివారం చోటుచేసుకొంది. బాధితులు, గ్రామస్తుల కథనం మేరకు... పుణ్యసముద్రం పంచాయతీ సంతపల్లె గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డి కుమారుడు బాబురెడ్డికి చెందిన చెరకు తోట పక్కన గల ట్రాన్స్‌ఫార్మర్‌లో షార్ట్ సర్క్యూటై నిప్పు రవ్వలు రాలి ఎండు గడ్డి అంటుకుంది. దీంతో పక్కనే ఉన్న చెరకు తోటకు మంటలు వ్యాపించాయి. సుమారు రెండు ఎకరాలు చెరకు తోట దగ్ధమైంది. గ్రామస్తుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకొన్న చిత్తూరు ఫైరింజన్ సిబ్బంది పక్క పొలాలకు మంటలు వ్యాపించకుండా అదుపు చేశారు. బెల్లం తయారీకి సిద్ధంగా గానుగ ఏర్పాటు చేసుకొన్నామని, షార్ట్ సర్క్యూట్‌తో పంట చేతికి అందే సమయంలో కాలి బూడిదైందని ఆవేదన వ్యక్తం చేశాడు.

షార్ట్ సర్క్యూట్‌తో చెరకు తోట దగ్ధం



దగ్ధమవుతున్న చెరకు తోట

తవణంపల్లె, జనవరి 27: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో చెరకు తోట దగ్ధమై రూ.3 లక్షలు విలువైన పంట నష్టం వాటిల్లిన సంఘటన మండలంలోని సంతపల్లెలో శనివారం చోటుచేసుకొంది. బాధితులు, గ్రామస్తుల కథనం మేరకు వివరాలు. మండలంలోని పుణ్యసముద్రం పంచాయతీ సంతపల్లె గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డి కుమారుడు బాబురెడ్డికి చెందిన చెరకు తోట పక్కన గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో షార్ట్ సర్క్యూటై నిప్పు రవ్వలు రాలి ఎండు గడ్డి అంటుకొన్నాయి. దీంతో పక్కనే ఉన్న చెరకు తోటకు మంటలు వ్యాపించాయి. ఈ సంఘటనలో సుమారు రెండు ఎకరాలు చెరకు తోట దగ్ధమైంది. గ్రామస్తుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకొన్న చిత్తూరు ఫైరింజన్ సిబ్బంది పక్క పొలాలకు మంటలు వ్యాపించకుండా అదుపు చేశారు. బెల్లం తయారీకి సిద్ధంగా గానుగ ఏర్పాటు చేసుకొన్నామని, షార్ట్ సర్క్యూట్‌తో పంట చేతికి అందే సమయంలో కాలి బూడిదైందని, తనను ఆర్థికంగా ప్రభుత్వమే ఆదుకోవాలని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

చంద్రబాబును కలసిన చిత్తూరు నేతలు



చిత్తూరు సిటీ, జనవరి 27: టీడీపీ అధినేత చంద్రబాబును చిత్తూరు నేతలు పీలేరులో కలిశారు. శనివారం మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, ఎమ్మెల్యే అభ్యర్థిత్వాన్ని కోరుకుంటున్న చంద్రప్రకాష్, కటారి హేమలత, కాజూరు బాలాజీ తదితరులు చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దొరబాబు చిత్తూరులో జనసేన, టీడీపీ ఆధ్వర్యంలో చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్న వారితో కలసి నిర్వహిస్తున్న గడప గడపకు రా.. కదలిరా.. కార్యక్రమం గురించి చంద్రబాబుకు వివరించారు. అందరూ కలసి పార్టీ గెలుపునకు కృషిచేయాలని, ఎమ్మెల్యే టికెట్ ఎవరికి ఇచ్చినా అందరూ కలసి పనిచేయాలని, అందరికీ సముచిత స్థానం కల్పిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని దొరబాబు చెప్పారు.

రాష్ట్రాన్ని జగన్ నుంచి కాపాడుకుందాం

● గాలి భానుప్రకాష్ పిలుపు

నగరి, జనవరి 27: రాష్ట్రాన్ని జగన్మోహన్‌రెడ్డి నుంచి కాపాడుకుందాం.. తరలిరండి అంటూ నగరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ ప్రజలకు పిలుపునిచ్చారు. నగరి పట్టణ పరిధిలోని 3 వ వార్డులో బాబు ష్యూరిటీ... భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భానుప్రకాష్ పాల్గొని ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేయడమేగాక రాజధాని కూడా లేకుండా నడివీధిలో నిలబెట్టిన జగన్‌ను ఓడించి రాష్ట్రాన్ని కాపాడుకుందామని ఆయన పిలుపునిచ్చారు. టీడీపీ హయాంలోనే అన్ని రంగాలలో అభివృద్ధి సాధించడమేగాక అన్ని వర్గాల వారికి ఆమోదయోగ్యమైన ప్రణాళికను చంద్రబాబు సిద్ధం చేశారని చెప్పారు. నగరిలో వైసీపీ రెండుసార్లు గెలిచినా అభివృద్ధి కనిపించలేదని తెలిపారు. రాష్ట్రానికి, నగరికి పట్టిన దరిద్రం పోవాలంటే సైకిల్ గుర్తుకే ఓటేయాలని ఆయన కోరారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్-6 పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నగరి పట్టణ టీడీపీ అధ్యక్షుడు రమేష్‌బాబు, కార్యదర్శి శ్రీనివాసన్, నాయకులు గుణశేఖర్, శేఖర్, మాజీ కమిషనర్ లోకేంద్రబాబు,జిల్లా పార్టీ కార్యదర్శి రుక్కుం బాలాజీ, వెంకటముని, కేపీ మణి, అల్లిముత్తు, ఏ.మణి, సలీం, శ్రీధర్, కేవీ సోము, రమేష్‌రెడ్డి, ఆకుల అశోక్, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ



ఎన్‌టీఏ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డీఈవో తదితరులు

చిత్తూరు (సెంట్రల్), జనవరి 27: నోబెల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) ముద్రించిన 2024 వార్షిక డైరీ, క్యాలెండర్‌ను శనివారం డీఈవో విజయేంద్రరావు ఆవిష్కరించారు. ఎన్‌టీఏ ప్రధాన కార్యదర్శి రామయ్య, కార్యవర్గ సభ్యులు రవి, భాస్కర్‌రెడ్డి, సోమశేఖర్, మునీంద్ర, వరదరాజులు, మధుసూదన్ పాల్గొన్నారు.

కేంద్ర పథకాలకు ప్రచారం కల్పించడమే లక్ష్యం

వెదురుకుప్పం, జనవరి 27: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు గ్రామాల్లో విస్తృత ప్రచారం కల్పించడమే వికసిత్ భారత్ లక్ష్యమని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పాముల శేషాద్రికుమార్ అన్నారు. శనివారం వెదురుకుప్పం మండలం అగ్గిచేనుపల్లిలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ పథకాల క్యాలెండరును ఆవిష్కరించారు. సంక్షేమ పథకాలను ప్రదర్శించారు. సంక్షేమ పథకాలపై ఈవోపీఆర్డీ పురుషోత్తం అవగాహన కల్పించారు. సచివాలయ ఉద్యోగులు, బీజేపీ వెదురుకుప్పం మండల అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న భీమనేని చిట్టిబాబు నాయుడు

పాలసముద్రం, జనవరి 27: టీడీపీ గెలుపే లక్ష్యంగా మండలంలోని పార్టీ నాయకులు, బూత్ కమిటీ కన్వీనర్లు పనిచేయాలని రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు పిలుపునిచ్చారు. శనివారం మండల టీడీపీ కార్యాలయంలో బూత్ కమిటీ కన్వీనర్లు, నాయకులతో సమావేశం నిర్వహించారు. బూత్ కమిటీ కన్వీనర్లు, నాయకులు గత ఎన్నికల్లో పోలింగ్ అయిన ఓట్లను పరిశీలించి ఏయే బూత్‌లో పార్టీకి తక్కువ ఓట్లు వచ్చాయో అలాంటి గ్రామాలను గుర్తించి, వాటిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రానున్న అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులకు ఎక్కువ ఓట్లు పడేటట్లు చూడాలన్నారు. ఎన్నికల వరకు నాయకులు, బూత్‌లెవల్ కన్వీనర్లు పార్టీకోసం కష్టపడి పనిచేయాలన్నారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థిని గెలిపించాలని, వైసీపీ అరాచకాల గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో చిత్తూరు పార్లమెంటు కార్యదర్శి వాసు నాయుడు, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి శేఖర్ రాజు, నాయకులు జె. విజయ్‌కుమార్, కేశవులు నాయుడు, చిరంజీవి యాదవ్, అరుణ్‌నాథన్, సాంబశివన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

డీఐజీ వద్ద రిపోర్టు చేసిన సీఐలు

చిత్తూరు, జనవరి 27: జిల్లాలో ఎస్‌ఐలుగా పనిచేస్తూ ఇటీవల సీఐలుగా పదోన్నతి పొందిన పలువురు అధికారులు శనివారం కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్‌కుమార్‌ను కలిసి రిపోర్టు చేసుకున్నారు. వీరిలో ఉమామహేశ్వరరావు, నాగరాజు, మనోహర్ తదితరులు ఉన్నారు. రెండుమూడు రోజుల్లో వీరికి పోస్టింగ్‌లు కేటాయించనున్నారు.



కర్నూల్ రేంజ్ డీఐజీని కలిసిన పదోన్నతి పొందిన సీఐలు

గాయపడిన సల్మాను పరామర్శించిన హోంగార్డు కమాండెంట్



పరామర్శిస్తున్న హోంగార్డు కమాండెంట్ మహేష్ తదితరులు

చిత్తూరు, జనవరి 27: ఇంటి తగాదా కారణంగా మరిది చేతిలో గాయపడిన హోంగార్డు సల్మాను చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో కర్నూలు రేంజ్ హోంగార్డు కమాండెంట్ మహేష్, సౌత్ రేంజ్ హోంగార్డు డీఎస్పీ చిరంజీవి, ఆర్‌ఐ భాస్కర్‌లు శనివారం పరామర్శించారు. చికిత్స పొందుతున్న సల్మా ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం రెండో పట్టణ సీఐ ఉలసయ్య నుంచి ఘర్షణకు దారి తీసిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.

వైసీపీ ఎన్నికల ప్రచారంలా ఆసరా సభ

గంగాధరనెల్లూరు, జనవరి 27: గంగాధరనెల్లూరు ఎంపీడీవో కార్యాలయం వద్ద శనివారం నిర్వహించిన వైఎస్సార్ ఆసరా సమావేశం వైసీపీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలా జరిగింది. ఎంపీపీ అనిత అధ్యక్షతన జరిగిన సభలో 'మన గుర్తు ఏందమ్మ చెప్పండమ్మ' అంటూ డ్వాక్రా మహిళలచేత డిప్యూటీ సీఎం నారాయణస్వామి అడిగి మరీ చెప్పించుకున్నారు. కాగా మండలానికి చెందిన 1283 డ్వాక్రా సంఘాలకు రూ.15.48కోట్లు చెక్‌ను మహిళలకు డిప్యూటీ సీఎం అందజేశారు. డీఆర్‌డీఏ పీడీ తులసి, పెనుమూరు ఏఎంసీ మాజీ చైర్మన్ చిన్నమరెడ్డి, రాష్ట్ర గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ డైరక్టర్ గుణశేఖర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వేలు మొదలి, వైస్ ఎంపీపీ హరిబాబు, గంగాధరనెల్లూరు సర్పంచ్ సుబ్రమణ్యం, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఏకాంబరం పాల్గొన్నారు.

ఆసరా చెక్కు పంపిణీ



శ్రీరంగరాజపురం, జనవరి 27: డిప్యూటీ సీఎం నారాయణస్వామి శనివారం ఎస్‌ఆర్‌పురం మండలంలో నాలుగో విడత ఆసరా కార్యక్రమం కింద రూ.7కోట్ల 48లక్షల చెక్కును పంపిణీ చేశారు. అనంతరం కోలాటం భజన కార్యక్రమంలో వారితో కలిసి ఆడి అలరించారు. డీఆర్డీఏ పీడీ తులసి, స్థానిక సర్పంచ్ హరితకుప్పయ్య, డీసీసీబీ డైరెక్టర్ బాలసుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు.

కార్వేటినగరంలో...

కార్వేటినగరం, జనవరి 27: ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆసరా పథకంకింద నాల్గవ విడతగా రూ. 9కోట్ల 40లక్షల 29వేలను మహిళలకు డిప్యూటీ సీఎం నారాయణస్వామి పంపిణీచేశారు. ఎంపీడీవో మోహనమురళి, ఎంపీపీ లత, వైసీపీ మండల కన్వీనర్ శేఖర్‌రాజు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై పోరాడతాం: టీడీపీ

విజయపురం, జనవరి 27: కార్మికుల సమస్యలపై టీడీపీ పోరాటం చేస్తుందని టీఎన్‌టీయూసీ జిల్లా కార్యదర్శి గుణశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. టెక్కలి నుంచి కుప్పం వరకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బస్సుయాత్రలో శనివారం పుత్తూరులో టీడీపీ నాయకులు కలుసుకున్నారు. కార్మికులకు జరుగుతున్న అన్యాయంపై పోరాటం తప్పదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు రఘురామరాజు, జిల్లా టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు రావిళ్ల మాధవనాయుడు, అధికార ప్రతినిధి మోహన్‌బాబు, నాయకులు దశరథరామయ్య తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో వినియోగదారుల ఫిర్యాదులు, పరిష్కారాల కమిషన్ చైర్మన్



ఐరాల(కాణిపాకం), జనవరి 27: రాష్ట్ర వినియోగదారుల ఫిర్యాదులు, పరిష్కారాల కమిషన్ చైర్మన్ జస్టిస్ టి.సునీల్ చౌదరి కుటుంబ సమేతంగా శనివారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. వారిని ఏఈవో ఎస్వీకృష్ణారెడ్డి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పాలసముద్రం, జనవరి 27: మండలంలో రాబోవు పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఎంపీడీవో రామనాథ రెడ్డి క్రిష్ణజిమ్మాపురం, శ్రీకావేరిరాజుపురం, పాలసముద్రం పంచాయతీల పరిధిలో పోలింగ్ కేంద్రాలుగా ఉండే పాఠశాలలను శనివారం తనిఖీ చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో మౌలిక వసతుల పట్ల ఆరాతీశారు. మౌలిక వసతుల కల్పనకు అన్ని చర్యలు చేపట్టాలని ఆయన ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు సూచించారు. ఆయన వెంట ఈవోపీఆర్డీ రమేష్, సచివాలయాల పరిధిలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పరీక్షాపే చర్చా కార్యక్రమం విద్యార్థులకు చూపండి: బీజేపీ

చిత్తూరు (సెంట్రల్), జనవరి 27: జిల్లాలోని అన్ని పాఠశాలల్లో సోమవారం ఉదయం 11 గంటలకు ప్రసారమయ్యే పరీక్షా పే చర్చా కార్యక్రమాన్ని విద్యార్థులు వీక్షించేలా చర్యలు చేపట్టాలని బీజేపీ నాయకులు శనివారం డీఈవోకు వినతి పత్రం సమర్పించారు. న్యూఢిల్లీ దూరదర్శన్‌తో పాటు ఇతర ఛానల్స్‌లో ప్రసారమయ్యే పరీక్షా పే చర్చా కార్యక్రమంలో ప్రధాని మోదీ విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు సూచనలు ఇవ్వడంతో పాటు వారు అడిగే ప్రశ్నలకు సమాధానం ఇవ్వనున్నట్లు తెలిపారు. డీఈవోకు వినతి పత్రం అందించిన వారిలో బీజేపీ నాయకులు చిట్టిబాబు, రామభద్ర, బ్రహ్మానందం, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు. కాగా నెహ్రూ యువకేంద్ర సంఘటన్ చిత్తూరు జిల్లా అడ్వయిజరీ కమిటీ సభ్యుడుగా షేక్ రెడ్డి మస్తాన్‌ను నియమిస్తూ ఎన్‌వైకేఎస్ డైరెక్టర్ జనరల్ నితీష్ కుమార్ మిశ్రా ఉత్తర్వులు జారీ చేశారు.

ఫిబ్రవరి లోగా జిల్లా కోర్టు భవన నిర్మాణ పనులు పూర్తిచేయాలి



భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్నజస్టిస్ రావు రఘునందనరావు

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 27: కొనసాగుతున్న జిల్లా కోర్టు నిర్మాణ పనులు ఫిబ్రవరి నెలాఖరులోగా పూర్తిచేయాలని జిల్లా పరిపాలనా న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందనరావు సూచించారు. శనివారం మధ్యాహ్నం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ. భీమారావుతో కలిసి జిల్లా కోర్టు సముదాయం నిర్మాణ పనులను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నాణ్యతతో కూడిన పరికరాలను ఉపయోగించి పనులు పూర్తిచేసి జిల్లా కోర్టుభవనాన్ని అప్పగించాలని ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించారు. కోర్టు భవనంలో జరుగుతున్న నిర్మాణపనులు, వాటికి ఉపయోగిస్తున్న వివిధ రకాల వస్తువులు, కోర్టు హాలు నిర్మాణం, లిఫ్టు నిర్మాణం పనులు, కేసుల పరిష్కారం కోసం కోర్టుకు వచ్చే కక్షిదారులకు కలిగించే తాగునీటి సౌకర్యాల పనులు సకాలంలో పూర్తిచేసి అందజేస్తామని ఆర్ అండ్ బీ అధికారులు న్యాయమూర్తికి వివరించారు. అనంతరం ఆయన జిల్లా కోర్టు ఆవరణలో ఉన్న రికార్డు గదులను పరిశీలించగా, పాత రికార్డుల గురించి జిల్లా న్యాయమూర్తి ఆయనకు వివరించారు. వారివెంట జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఐ. కరుణకుమార్, ఆర్ అండ్ బీ ఎస్‌ఈ ఉమామహేశ్వరరావు, పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు, ఆర్ అండ్ బీ, విద్యుత్‌శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సమస్యలను హైకోర్టు కమిటీ దృష్టికి తీసుకెళతా

● జిల్లా పరిపాలనా న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందనరావు హామీ



జస్టిస్ రఘునందనరావును సన్మానిస్తున్న రాజేంద్ర రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 27: చిత్తూరు న్యాయవాదుల సంఘం సభ్యుల సమస్యలను హైకోర్టు కమిటీ దృష్టికి తీసుకెళతానని జిల్లా పరిపాలనా న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందనరావు హామీ ఇచ్చారు. శనివారం మధ్యాహ్నం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ. భీమారావు, జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఐ. కరుణకుమార్‌లతో కలిసి చిత్తూరు న్యాయవాదుల సంఘ సభ్యుల ఆహ్వానం మేరకు న్యాయవాదుల సంఘ భవనాన్ని సందర్శించారు. జస్టిస్ రఘునందనరావు మాట్లాడుతూ న్యాయవాదుల సంఘం సభ్యులు తనను సన్మానించడం చాలా సంతోషంగా ఉందన్నారు. జిల్లాలోని వివిధ న్యాయవాదుల సంఘాల సభ్యులు తెలిపిన సమస్యలను హైకోర్టు దృష్టికి తీసుకెళతానని చెప్పారు. అంతకు ముందు జస్టిస్ రఘునందనరావును చిత్తూరు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు రాజేంద్ర రెడ్డి, కార్యదర్శి అశోక్ ఆనంద్ యాదవ్, న్యాయవాదుల క్రమశిక్షణా సంఘం అధ్యక్షుడు నల్లారి ద్వారకనాథ్ రెడ్డితో పాటు మదనపల్లి, పీలేరు, సత్యవేడు, తంబళ్ళపల్లి న్యాయవాద సంఘం సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని న్యాయమూర్తులు, న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కార్మికులకు భరోసా కల్పించడానికే బస్సుయాత్ర

● గాలి భానుప్రకాష్



టీఎన్‌టీయూసీ నాయకులకు కేక్ తినిపిస్తున్న భానుప్రకాష్

నగరి, జనవరి 27: రాష్ట్రంలో కార్మికులకు భరోసా కల్పించడానికే శ్రీకాకుళం జిల్లా టెక్కలి నుంచి కుప్పం వరకు చంద్రన్న కార్మిక చైతన్య బస్సుయాత్రను చేపట్టినట్లు నగరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం నగరి పట్టణానికి బస్సుయాత్ర చేరుకోవడంతో భానుప్రకాష్ వారికి స్వాగతం పలికారు. పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి టీఎన్‌టీయూసీ నాయకులకు తినిపించి బస్సుయాత్రను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో కార్మికులకు భద్రత, ఉపాధి లేకుండా పోయిందని విమర్శించారు. రానున్న రోజులలో కార్మికులకు మంచి భవిష్యత్తు ఉంటుందని వారికి భరోసా కల్పిస్తూ ఈ బస్సుయాత్ర సాగుతోందన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఒక్క పరిశ్రమ కూడా రాష్ట్రానికి రాలేదన్నారు. చిత్తూరు జిల్లా టీఎన్‌టీయూసీ అధ్యక్షులు రావిళ్ల మాధవ నాయుడు, రాష్ట్ర టీఎన్‌టీయూసీ అధ్యక్షులు రఘురామరాజు, రాష్ట్ర కార్యదర్శి బాలాజీ, జిల్లా అధికారప్రతినిధి జ్యోతి నాయుడు, గుణశేఖర్‌రెడ్డి, బాలసుబ్రమణ్యం, రమేష్‌బాబు, మాణిక్యవాసన్, ఆనంద రెడ్డి, జిందూజా, లెనిన్‌బాబు, పరుచూరి ప్రసాద్, శివాజీ, పలువురు కార్మికులు పాల్గొన్నారు.



చిత్తూరులో గురువారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందనరావుకు స్వాగతం పలుకుతున్న ఎస్పీ రిషాంత్‌రెడ్డి, కలెక్టర్ షణ్మోహన్

చంద్రబాబు సీఎం అయ్యేవరకు చెప్పులు వేసుకోను: వాసురెడ్డి



గుడిపాల, జనవరి 27: టీడీపీ అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యేవరకు తన కాళ్లకు పాదరక్షలు వేసుకోనని మండలంలోని కోటూరు గ్రామానికి చెందిన వాసురెడ్డి దీక్షపూనారు. గ్రామ స్థాయి నుంచి మండల, జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయి వరకు ఏ సమావేశం నిర్వహించినా పార్టీ కార్యక్రమాలకు చురుగ్గా పాల్గొని, కార్యకర్తలకు తనవంతు సహకారాన్ని ఆయన అందించడం విశేషం. 2024లో చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాతే పాదరక్షలు ధరిస్తానని ఆయన స్పష్టం చేశారు.

ఎస్టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక

విజయపురం, జనవరి 27: మండల ఎస్టీయూ నూతన కార్యవర్గాన్ని శనివారం నగరి పీసీఎన్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ వాణి ప్రధాన సంపాదకులు గాజుల నాగేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అరగొండ హేమచంద్రారెడ్డి, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి కలికిరి పవన్‌కుమార్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మురళి, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసులు, ఆర్థిక కార్యదర్శిగా వేణుప్రసాద్, సహాధ్యక్షుడిగా తిరుమలేశ్‌రెడ్డి, అదనపు ప్రధాన కార్యదర్శిగా ఢిల్లీబాబు, మహిళా కార్యదర్శిగా సోమల, జిల్లా కౌన్సిలర్లుగా అరుణ్‌కుమార్, పురుషోత్తం, బాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పేదలకు అన్నదానం

పూతలపట్టు, జనవరి 27: మండల కేంద్రంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఎన్‌ఆర్‌ఐ టీడీపీ నేత ఊట్ల శ్యామసుందర్‌రావు శనివారం అన్నాక్యాంటీన్‌లో అన్నదానం చేశారు. నాయకులు ఊట్ల నాగరాజ నాయుడు, ఏకాంబరం, వీరభద్రయ్య, హరి, చంద్రశేఖర్ నాయుడు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా సాగిన మండల మీట్

● కొత్తకోట వద్ద బస్టాపింగ్ ఏర్పాటు చేయండి



సమావేశంలో పాల్గొన్న అధికారులు

పూతలపట్టు, జనవరి 27: ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం తూతూమంత్రంగా సాగింది. అధికార పార్టీకి చెందిన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఉండటంతో అధికారుల దృష్టికి సమస్యలు తీసుకెళ్లేవారే కరువయ్యారు. కొత్తకోట సర్పంచ్ పద్మజారాణి మాట్లాడుతూ కొత్తకోట గ్రామం వద్ద సిక్స్ లేన్ రోడ్డు ఏర్పాటు చేయకముందు చిత్తూరు నుంచి తిరుపతి వైపు, తిరుపతి నుంచి వేలూరు వైపు వెళ్లే బస్సులు కొత్తకోట వద్ద ఆగుతుండటంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా బస్సులు ఎక్కేవారని చెప్పారు. ప్రస్తుతం సిక్స్‌లేన్ రోడ్డు ఏర్పాటు చేశాక ఆర్టీసీ బస్సులు కొత్తకోట గ్రామం వద్దకు రాకుండా సిక్స్‌లేన్ రోడ్డుపై వెళుతుండటంతో ప్రయాణికులు, విద్యార్థులు రోడ్డుపై గంటల తరబడి ఎండనక, వాననక నిలబడి బస్సు ఎక్కాల్సిన దుస్థితి నెలకొందని, ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఎం. బండపల్లి ఎంపీటీసీ యతీష్ మాట్లాడుతూ స్థానికంగా ఉన్న పశువైద్యాధికారులు పాడిరైతులకు అందుబాటులో ఉండటంలేదని, రైతులకు రావాల్సిన సబ్సిడీలపై వారికి అవగాహన కల్పించడంలేదని వాపోయారు. ఈ సమావేశంలో ఎంపీపీ కుమారి, ఎంపీడీవో గౌరి, డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీప్రసన్న, డీటీ హేమగిరి, వైస్ ఎంపీపీ ద్వారకనాథ రెడ్డి, పూతలపట్టు, ఈసీపల్లె సింగిల్‌విండో ప్రెసిడెంట్లు జయచంద్రారెడ్డి, దొరస్వామి రెడ్డితో పాటు పలువురు అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు తప్పక పాటించాలి



ప్రజల చేత ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే, రవాణా శాఖ అధికారులు

చిత్తూరు సిటీ, జనవరి 27: రోడ్డు భద్రతా నియమాలను తప్పక పాటించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శనివారం నగరంలోని గాంధీ విగ్రహం నుంచి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వరకు కళాశాల విద్యార్థులు, డ్రైవింగ్ స్కూల్ యాజమాన్యాలు, ద్విచక్ర వాహన మెకానిక్‌లు, ద్విచక్ర వాహన డీలర్లు, ట్రాఫిక్ పోలీసులతో కలసి వాకథాన్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలు పాటిస్తే చాలా వరకు రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చునని చెప్పారు. మానవ తప్పిదాల వల్లే చాలా వరకు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ఈ సందర్భంగా పలు స్లోగన్లతో కూడిన ప్లకార్డులను ప్రదర్శిస్తూ ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. అనంతరం ట్రాఫిక్ నియమాలను తప్పక పాటిస్తామని ప్రజలచేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీటీసీ నిరంజన్ రెడ్డి, ఆర్టీవో సునీల్ కుమార్, ఎంవీఐలు వాసుదేవ రెడ్డి, రాజేశ్వరరావు, మురళి, దీపిక, ఏఎంవీఐలు ప్రసాద్ వర్మ, భాగ్యశ్రీ, ఎస్పై రాజు తదితరులు పాల్గొన్నారు.

యువశక్తితోనే సామాజిక మార్పు

గుడిపాల, జనవరి 27: యువశక్తితోనే సామాజిక మార్పు జరుగుతుందని మోటర్ వెహికల్ ఇన్స్‌పెక్టర్లు శివారెడ్డి, ప్రసాద్ వర్మ అన్నారు. శనివారం మండలంలోని నరహరిపేట ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టు వద్ద 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా డ్రైవర్లకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్సు, హెల్మెట్, వేగనిరోధక చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్లు, కానిస్టేబుళ్ళు పాల్గొన్నారు.

వన వేణుగోపాలస్వామికి క్షీరాభిషేకం

వెదురుకుప్పం, జనవరి 27: మండలంలోని దేవరగుడిపల్లె-ఆడారెడ్డిపల్లె సమీపంలో ఉన్న వన వేణుగోపాలస్వామికి శనివారం క్షీరాభిషేక కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రధాన అర్చకులు కె.కార్తీక్ అయ్యంగార్ స్వామిని ప్రత్యేక అలంకరించి, క్షీరాభిషేకం, అర్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర గ్రామాల భక్తులు స్వామిని దర్శించుకోగా, తీర్థప్రసాదాలను అందజేశారు. మధ్యాహ్నం అన్నప్రసాదం అందించారు. కార్యక్రమంలో కార్యనిర్వాహకులు శివకుమార్ పాల్గొన్నారు.

ఆలయం వద్ద అన్నదానం

కార్వేటినగరం, జనవరి 27: కార్వేటినగరం టీటీడీ వేణుగోపాలస్వామి ఆలయం వద్ద శనివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తమ కుటుంబ సభ్యుల పేర్ల మీద ఆలయం వద్ద అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించడానికి ఆసక్తి ఉన్న భక్తులు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ కుమార్ సూచించారు.

జిల్లాస్థాయికి ఎంపికైన పూతలపట్టు జట్టు



పూతలపట్టు, జనవరి 27: ఆడుదాం ఆంధ్ర క్రీడల్లో భాగంగా మండలంలోని పోలవరంలో జరిగిన క్రికెట్ పోటీల్లో పూతలపట్టు జట్టు జిల్లా స్థాయికి ఎంపిక అయ్యింది. గత కొన్ని రోజులుగా నిర్వహిస్తున్న నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీల్లో శనివారం జరిగిన పోటీల్లో యాదమరి జట్టుపై పూతలపట్టు జట్టు విజయం సాధించి జిల్లాస్థాయికి ఎంపికైంది. గెలుపొందిన జట్టుకు ఎంపీడీవో గౌరి చేతులమీదుగా ట్రోఫీని అందజేశారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ ద్వారకనాథ్ రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ పోలవరం సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రేమించి పెళ్లి చేసుకున్నాం.. రక్షణ కల్పించండి



మాట్లాడుతున్న ప్రేమజంట

చిత్తూరు సిటీ, జనవరి 27: ప్రేమించి పెళ్లి చేసుకున్నామని, తమ పెద్దల నుంచి రక్షణ కల్పించాలని ప్రేమ జంట మీడియాను ఆశ్రయించింది. శనివారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో గుడిపాల మండలం చెరువు ముందర ఊరుకు చెందిన కాంచన, భరత్ విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ తాము ఇద్దరం ప్రేమించుకున్నామని, తమ కులాలు వేరుకావడంతో పెద్దలు పెళ్లికి అంగీకరించలేదని చెప్పారు. కాగా పెద్దలకు తెలియకుండా పెళ్లి చేసుకున్నామని, ఇరు కుటుంబాల పెద్దల నుంచి తమకు రక్షణ కల్పించాలని వారు కోరారు.

విద్యాసామగ్రి పంపిణీ



వెదురుకుప్పం, జనవరి 27: దాతల సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని దేవళంపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం లీలావతి అన్నారు. శనివారం ఆ పాఠశాలలో మర్రిపల్లెకు చెందిన అనిల్‌కుమార్, రమ్యకృష్ణ దంపతుల వితరణతో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పెట్లు, గ్లాసులు, ఇతర సామగ్రిని అందచేశారు. దాతల వితరణ అభినందనీయమన్నారు.